## క్లుప్తంగా

### గోకులం షెడ్ల పరిశీలన

పగిడ్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న మినీగోకులం షెడ్లను డ్వామా పీడీ జనార్ధన్‌రావు గురువారం తనిఖీ చేశారు. పగిడ్యాల గ్రామంలోని నాగేశ్వరమ్మ, మల్లేశ్వరమ్మకు మంజూరైన మినీగోకులం షెడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. పనుల్లో పురోగతి సాధించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీడీ అన్వరాభేగం, ఏపీఓ మద్దిలేటి, ఈసీ, టీఏలు ఉన్నారు.

### దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

### ఇస్తెమా ప్రాంతాన్ని సందర్శించిన ఆర్డీఓ



ఇస్తెమా ప్రాంతంలో ఆర్డీఓ నాగజ్యోతి

ఆత్మకూరు: పట్టణంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇస్తెమా ప్రాంతాన్ని గురువారం ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి సందర్శించారు. సౌకర్యాలపై అధికారులను ఆరా తీశారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈమె వెంట తహసీల్దార్ రత్నరాధిక తదితరులు పాల్గొన్నారు.

### ఆదర్శనీయురాలు షేక్ ఫాతిమా



ఫాతిమా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త షేక్ ఫాతిమాను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సీఎస్ఐ స్కూల్‌లో ఫాతిమా జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షేక్ ఫాతిమా సోదరుడు ఉస్మాన్ సహకారంతో సావిత్రీబాయి పూలే దగ్గర విద్యనభ్యసించారని తెలిపారు. దేశంలో ముస్లిం తొలి మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా అన్నారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని కొనియాడారు. సంఘం నాయకులు రజిత, ప్రసాద్, మహానంది, దినేష్ పాల్గొన్నారు.

### కౌండిన్య గౌడ సత్రం నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన పాలకమండలి సభ్యులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని కౌండిన్య గౌడ సత్రానికి 2025 నుంచి 2028 సంవత్సరం వరకు నూతన పాలకమండలి సభ్యులను ఎన్నుకున్నట్లు గురువారం సత్రం ప్రధాన కార్యదర్శి గూండ్ల. మల్లికార్జున తెలిపారు. కమిటీ అధ్యక్షురాలిగా గడ్డమీది అనురాధ గౌడ్, ఉపాధ్యక్షులుగా గుండ్ల. శివ మల్లికార్జున గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శిగా గూండ్ల మల్లికార్జున గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా మన్యం గోపి గౌడ్, నాయక్వడి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా ఈడిగ వెంకటేశ్వర గౌడ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

### మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నూనెపల్లె ఎల్లారెడ్డి, నాగిరెడ్డి, రమణారెడ్డి, సాంబ, అంజి, రాజేష్, శ్రీను, బాలకృష్ణ మానవతా దృక్పథంతో అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

# శ్రీశైలం గజగజ

శ్రీశైలం మండలంలో ప్రజలను చలి ఒణికిస్తోంది. శ్రీశైలం, సున్నిపెంట, లింగాలగట్టు గ్రామాలు కృష్ణా నదికి దగ్గరగా ఉండడం, చుట్టూ దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం విస్తరించడంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గ్రామాల్లో మంచుదుప్పటి కప్పుకుంది. ఉదయం 08.00 గంటల వరకూ మంచు తొలగకపోవడం, ఎండ రాకపోవడంతో చలి తీవ్రత 9 గంటల వరకు ఉంటోంది. సాయంత్రం 05.30 నుంచే మళ్లీ చలి తీవ్రత పెరిగిపోతుంది. చలితీవ్రతకు తట్టుకోలేక ప్రజలు రాత్రి, ఉదయం సమయాలలో చలిమంటలు వేసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు.

-శ్రీశైలంప్రాజెక్ట్





ఉదయం 7.30 గంటలైనా వీడని మంచుదుప్పటి,
(ఇన్‌సెట్) రాత్రి ఏడు గంటలకే చలికి తట్టుకోలేక చలిమంటలు వేసుకుంటున్న ప్రజలు

# వైకుంఠ ఏకాదశికి మహానంది ముస్తాబు

- నేడు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం
- ఉదయం ప్రత్యేక పూజలు

మహానంది: శివ కేశవులకు నిలయమైన మహానంది ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాలు అందంగా ముస్తాబయ్యాయి. ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణాలు, ఉత్తర ద్వారం, గోపురాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహానందిలో కొలువైన శ్రీ సీతా సమేత కోదండ రాములవారికి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. అందులో భాగంగా కోదండ రాముల వారిని తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉత్తర ద్వారంలో కొలువు చేస్తామన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారంలో కొలువైన వైకుంఠ వాసుని దర్శనం చేసుకోవచ్చన్నారు.



ఉత్తర ద్వారంలో అందంగా అలంకరించిన విద్యుత్ దీపాలంకరణ

### ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం వేకువజాము నుంచి సాయంత్రం 1 గంట వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు ఉత్తర ద్వార దర్శనం ద్వారా వెంకటేశ్వరస్వామి దర్శనాన్ని కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు చెప్పారు.



విద్యుత్ వెలుగుల్లో ఉత్తర గాలిగోపురం

## ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష

శ్రీశైలటెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో శుక్రవారం నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవం, పుష్పార్చన ఏర్పాట్లను శ్రీశైల దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు సమీక్షించారు. గురువారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం జరిపే ఉత్సవంలో, పుష్పార్చనలోనూ ఆయా కైంకర్యాలన్నీ స్వామిఅమ్మవార్లకు పరిపూర్ణంగా జరిపించాలని వైదిక సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ఆయా పూజాదికాలకు సంబంధించి సమయపాలన పాటించాలన్నారు. ఉదయం జరుగనున్న శ్రీస్వామిఅమ్మవార్ల గ్రామోత్సవంలో ఎటువంటి లోటు లేకుండా ఉండాలని ఆలయ, ఇంజినీరింగ్, భద్రతా విభాగాలను ఆదేశించారు. భక్తులు క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని క్యూకాంప్లెక్స్ విభాగాన్ని ఆదేశించారు. పుష్పార్చనను భక్తులు వీక్షించేందుకు అక్కమహాదేవి అలంకార మండపంలో ఎల్.ఈ.డి స్క్రీనును ఏర్పాటు చేయాలన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఈఓ ఎం. శ్రీనివాసరావు

# ముందస్తు సంక్రాంతి వేడుకలు



మోడల్ స్కూల్‌లో భోగి మంటలు

మహానంది: మండల కేంద్రం తిమ్మాపురంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సనాతన సంప్రదాయాలు వర్తమానానికి, విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో సంక్రాంతి సంబరాలు నిర్వహించామని అని మహానంది మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణ రంగుల లోగిలిగా మారింది. గంగిరెద్దు అలంకరణ, హరిదాసు వేషధారణ వేసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మహానంది మండలం ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, వైస్ ప్రిన్సిపల్ పీర్ బాషా, పాఠశాల ఉపాధ్యాయుడు కష్ణమూర్తి, నీలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద ముగ్గు వేస్తున్న విద్యార్థినులు

జూపాడుబంగ్లా: స్థానిక మోడల్ స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ రమేష్ విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు పండుగ విశిష్టత ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. అనంతరం ఆటపాటలతో సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థినులను అభినందించారు.

# ఇంటర్ విద్య కీలకం

మిడుతూరు: ఇంటర్మీడియెట్ విద్య ఎంతో కీలకమని, విద్యార్థులు ఆధునిక విద్యపై దృష్టిసారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 24వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యను అభ్యసించాలన్నారు. పరీక్షల సమయంలో మంచి మార్కులు సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. సాంకేతిక విద్యపై పట్టు సాధిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి మంచి ఉద్యోగాలు పొందేందుకు వీలవుతుందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాయకులు కాతా రమేష్‌రెడ్డి, తువ్వా భగీరథరెడ్డి, గుండం సర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

## 14న ముగ్గుల పోటీలు

పాములపాడు: సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల14వ తేదీ స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయ ఆవరణలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మురళీమోహన్ తెలిపారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సలేషన్ బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 11వ తేదీలోపు 8686672818 నంబర్‌కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## నేడు కృష్ణానదిలో చేపపిల్లల విడుదల

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ సమీపంలో కృష్ణానది బ్యాక్ వాటర్‌లో గురువారం చేపపిల్లలు విడుదల చేయనున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎఫ్‌డీఓ భరత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ బైరెడ్డి శబరి హాజరుకానున్నట్లు చెప్పారు. చేపపిల్లల విడుదల అనంతరం పాతముచ్చుమర్రిలో మినీగోకులం షెడ్లను ప్రారంభిస్తారన్నారు. అన్నిశాఖల మండలస్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

## రేపటి నుంచి ఉచిత ధ్యాన యోగా శిక్షణ

కొత్తపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఉచిత ధ్యాన యోగా ఆధ్యాత్మిక శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గురువు జ్ఞానప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యోగా చేయడం ద్వారా ఎన్నో ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయని పేర్కొన్నారు. శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు.

## కౌలు రైతులకు బ్యాంకు రుణాలు

బండిఆత్మకూరు: కౌలు గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు అందజేయనున్నట్లు బండిఆత్మకూరు సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ సతీష్‌కుమార్ తెలిపారు. బండిఆత్మకూరు సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులు, కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులతో పాటు కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. రుణాలను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఆత్మకూరు: అర్హులైన పేదలందరికీ కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఎం పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శి ఎ.రణధీర్, వీరన్న, రామ్‌నాయక్, సురేంద్ర, షేక్ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్‌హాల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పేదలకు ఉండేందుకు ఇల్లు నిర్మించి ఆదుకోవాలన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మహానంది: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మహానంది ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని సూచించారు. మండల కేంద్రమైన తిమ్మాపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ దౌలా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాధికారత కల్పనే పొలం బడి లక్ష్యం



తిమ్మాపురంలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

మిడుతూరు: పెట్టుబడులు తగ్గించి అధిక దిగుబడులు సాధించేలా రైతులకు సాధికారత కల్పించడమే పొలం బడి లక్ష్యమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ పరిశోధన సంస్థ నంద్యాల ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. గురువారం మిడుతూరుతోపాటు తిమ్మాపురం గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. విత్తనం నుంచి విక్రయం వరకు సమగ్ర ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, సమగ్ర పంటల యాజమాన్యం అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మేలైనా వ్యవసాయ పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించాలని తెలిపారు. పర్యావరణ అనుకూలంగా సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. అనంతరం శనగ పంటను పరిశీలించారు. ఏఓ పీరునాయక్, ఏఈఓలు సంధ్య, అశోక్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

# వివరాలు పక్కాగా నమోదు చేయాలి

జూపాడుబంగ్లా: వర్షపాతం నమోదుతో పాటు నిత్యావసర వస్తువుల విక్రయాల వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఉపగణాంకాధికారులు ఎం.నాగరాజు, రామాంజనేయులు తెలిపారు. గురువారం జూపాడుబంగ్లా వర్షపాత నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే పలు దుకాణాలను తనిఖీ చేశారు. వర్షం కురిస్తే అందుకు సంబంధించిన రికార్డులు ఎప్పటికప్పుడు పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే నిత్యావసర వస్తువులు విక్రయించే కిరాణ దుకాణాల్లో వస్తువుల ధరలను తెలుసుకుని వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.



వర్షపాతం నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు నాగరాజు, రామాంజనేయులు

# సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తొగురు సరోజిని వర్ధినియ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. పాములపాడు ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం-2లో విద్యుత్ సౌకర్యం లేకపోయినా బిల్లు వేస్తున్నారని సూపర్‌వైజర్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మిట్టకందాల గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు మధ్యలోనే నిలిపి కాంట్రాక్టర్ వెళ్లారని వాటి పరిస్థితి ఏంటని సర్పంచ్ చింతల నారాయణ జేఈ రాఘవేంద్రప్రసాద్‌ను ప్రశ్నించారు. అలాగే ఇస్కాల గ్రామంలో ప్రోటోకాల్ పాటించకపోవడంపై సర్పంచ్ మౌలాలి జేఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో డీటీ సుప్రియ, ఏసీడీపీఓ మంగవల్లి, ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఎంఈఓ సుభాషిణిదేవి తదితరులు పాల్గొన్నారు.

# సుంకన్నగౌడు సేవలు మరువలేనివి

నందికొట్కూరు: కలియుగ దానకర్ణుడు జవ్వాజి సుంకన్నగౌడు సేవలు మరువలేనివని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని జవ్వాజి సుంకన్న గౌడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కేఈ మాట్లాడుతూ..పట్టణంలో సుమారు 40 ఎకరాలు ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు, కళాశాలలకు అందించిన గొప్ప వ్యక్తి సుంకన్నగౌడు అని కొనియాడారు. నందికొట్కూరు ప్రథమ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా పదేళ్ల పాటు పని చేశారన్నారు. సేవా సమితి సభ్యులు శ్రీకాంత్‌గౌడు, సాయిరాం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సుంకన్నగౌడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

## ఎస్సీ జాబితాలో బీసీల పేర్లపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు: ఎస్సీ జాబితాలో బీసీ కులాల పేర్లు ఎలా వస్తాయని మాలమహానాడు నాయకులు పబ్బతి శివ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. జాబితా తప్పుల తడకగా ఉందని మరోసారి జాబితాను పరిశీలించాలని వినతి పత్రం అందజేశారు. పారదర్శకంగా జాబితా తయారు చేయాలని కోరారు. మాలమహానాడు నాయకులు వెంకటేష్, నాగరాజు, పుల్లన్న, ప్రసాద్, మల్లయ్య, అర్జున్, దక్క జంబులయ్య, పరమేష్ పాల్గొన్నారు.

## అమిత్ షాను తొలగించాలి

కొత్తపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను ఆ పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అతాఉల్లా, ఉపాధ్యక్షుడు మద్దిలేటి డిమాండ్ చేశారు. గురువారం కొత్తపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

## దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సుధాకర్ దంపతులు

జూపాడుబంగ్లా: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని తూడిచెర్ల ఎంపీటీసీ దొడ్డానాగమణి, దొడ్డాసుధాకర్ దంపతులు గురువారం ఐదు జంటలకు దుస్తులు పంపిణీ చేశారు. ఏటా మానవతా దృక్పథంతో పేదవారికి తనవంతు సహాయం చేస్తున్నట్లు తెలిపారు.

## దేశ ఐక్యతకు పునాది రాజ్యాంగం

ఆత్మకూరు: దేశ ఐక్యతకు పునాది రాజ్యాంగం అని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున అన్నారు. గురువారం ఆత్మకూరులోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దేశ సమైక్యత, మతసామరస్యం, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం ప్రగతి బాటలో ముందుకు అడుగేద్దామని రాజ్యాంగాన్ని డా.బి.ఆర్.అంబేడ్కర్ రచించారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి, మహిళలకు, విద్యార్థులకు ఎలాంటి రక్షణలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా, నిరుద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు షేక్షావలి, వర్ధన్, అజయ్, రాజేష్, వంశీ, అంజి తదితరులు పాల్గొన్నారు.

## సుంకులమ్మ ఆలయంలో చోరీ



రాళ్లగుట్టల్లో పడేసిన హుండీ

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు సుంకులమ్మ దేవాలయంలో గురువారం చోరీ జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు.. దొంగలు ఆలయం తలుపులకున్న తాళాన్ని పెకిలించి లోనికి వెళ్లి హుండీని తీసుకెళ్లారు. కొంత దూరంలోని రాళ్లగుట్టలో హుండీ తాళం, పెకిలించేందుకు ఉపయోగించిన ఇనుప చువ్వలు, హుండీని, అమ్మవారి చీరను పడేశారు. హుండీలో ఉన్న సుమారు రూ. 30 వేల నగదును దోచుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు.

## ట్రాఫిక్ జాం.. ప్రయాణికుల ఇక్కట్లు

జూపాడుబంగ్లా: 80బన్నూరు సమీపంలో కర్నూలు-గుంటూరు రహదారిపై గురువారం సాయంత్రం ట్రాఫిక్ జాం కావడంతో ప్రయాణికులు రెండు గంటల పాటు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆత్మకూరులో జరుగుతున్న ఇస్తెమా ముగియడంతో అందులో పాల్గొన్న వారు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో ఒక్కసారిగా నందికొట్కూరు, కర్నూలు ప్రాంతాలకు బయలుదేరారు. 80బన్నూరు వద్ద హైవే కాంట్రాక్టర్ లోతట్టులో ఇరుకుగా రోడ్డును నిర్మించడంతో అక్కడ ట్రాఫిక్ జాం అయింది. దీంతో రెండుగంటల పాటు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ లక్ష్మీనారాయణ ట్రాఫిక్‌ను క్లియర్ చేసి రాకపోకలను పునరుద్ధరించారు.



ట్రాఫిక్ జాం కావడంతో కేజీ రోడ్డుపై నిలిచిన వాహనాలు